క్లుప్తంగా

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి



నీటినిల్వలను పారబోయిస్తున్న వైద్యారోగ్య సిబ్బంది

బొబ్బిలి రూరల్: ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని మండలంలోని పిరిడి గ్రామ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది సూచించారు. మండలంలోని పారాది గ్రామంలో డ్రైడే కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. వైద్యారోగ్య సిబ్బంది గ్రామంలో పర్యటించి, ఇళ్ల ముంగిట ఉన్న అనవసర నిల్వలు, మురుగునీటిని తొలగింపు పనులు చేయించి, పరిసరాల పరిశుభ్రత ద్వారా కలిగే ప్రయోజనాలను వివరించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే మలేరియా, డెంగీ, డయేరియా, టైఫాయిడ్ వంటి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఉండి, అందరూ ఆరోగ్యంగా ఉంటారని సిబ్బంది అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు బాగు చేయాలని డిమాండ్



ధర్నా చేస్తున్న శివాలయం వీధివాసులు

బొబ్బిలి: స్థానిక శివాలయం వీధిలోని గుంతలమయమైన రోడ్డును బాగు చేయాలని కోరుతూ ఆ వీధివాసులు శుక్రవారం ధర్నా చేపట్టారు. గురువారం రాత్రి అధ్వానంగా ఉన్న ఈ రోడ్డులో గుర్తు తెలియని వాహనం ఢీకొని మణికంఠ అనే ఏడో తరగతి విద్యార్థి మృతి చెందగా, మృతుడి తల్లిదండ్రులు, బంధువులు, స్థానికులంతా రోడ్డెక్కి ఎలాగైనా తమ రోడ్డు మరమ్మతులు చేయాల్సిందేనని పట్టుబట్టారు. విషయం తెలుసుకున్న మున్సిపల్ కమిషనర్ రామలక్ష్మి, పోలీసులు అక్కడికి చేరుకుని, ఆందోళనకారులకు సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. ఎమ్మెల్యే బేబినాయన కూడా అక్కడికి చేరుకుని, బాధితులు, నిరసనకారులతో మాట్లాడారు. బాధిత కుటుంబానికి న్యాయం చేస్తామని, రోడ్డును కూడా బాగు చేయిస్తామని హామీ ఇచ్చారు. దీంతో ఆందోళన సద్దుమణిగింది.

ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా 'చలో ఢిల్లీ'



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న అంబేడ్కర్ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు సాంబయ్య

బొబ్బిలి: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా చలో ఢిల్లీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు అంబేడ్కర్ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు సోరు సాంబయ్య తెలిపారు. స్థానిక పట్టణంలో ఆ కార్యక్రమానికి సంబంధించి, రూపొందించిన వాల్‌పోస్టర్లను శుక్రవారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ నెల 7వ తేదీ నుంచి మూడు రోజుల పాటు ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద దీక్ష చేపడుతున్నామన్నారు. ఉత్తరాంధ్ర నుంచి వేలాదిమంది మాల, ఇతర ఉపకులాల వారు హాజరై, ఐక్యత చాటి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మాల మహానాడు అధ్యక్షుడు ఎండ గోపాలరావు, ఎండ రాము తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలు కల్పించండి

బొబ్బిలి రూరల్: మండలంలోని అక్కేనవసలస, కృపవలస, రామన్నవలస, సియోనువలస గిరిజన గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని సీపీఐ నాయకులు ఒమ్మి రమణ, కోట అప్పన్న తదితరులు కోరారు. ఇదే విషయమై వారు స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి శుక్రవారం వెళ్లి, గిరిజన గ్రామాల్లో నెలకొన్న పరిస్థితులను వివరించారు. రోడ్లు, తాగునీరు, విద్యుత్ సౌకర్యాలు లేకపోవడంతో అక్కడి గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. స్పందించిన ఎమ్మెల్యే.. అధికారులతో మాట్లాడి, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

కేసు నమోదు

సంతకవిటి: మండలంలోని రామచంద్రాపురంలో కాయల ఎల్లమ్మ అనే వృద్ధురాలిపై ఓ వ్యక్తి మద్యం మత్తులో కర్రలు, రాళ్లతో చేసిన దాడి ఘటనపై బాధితురాలి తమ్ముడు కె.త్రినాథ్ చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ షేక్ శంభర్ గురువారం సాయంత్రం తెలిపారు. ఇటీవల అదే గ్రామంలోని రచ్చబండపై ఆ వృద్ధురాలు కూర్చొని ఉండగా, అదే గ్రామానికి చెందిన వ్యక్తి పూటుగా మద్యం తాగి అక్కడికి వచ్చి, ఇక్కడెందుకు కూర్చొని ఉన్నావని ఆ వృద్ధురాలితో వాగ్వాదానికి దిగి, దాడికి పాల్పడిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఆమె తీవ్రగాయాలతో శ్రీకాకుళం జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

వణికిస్తున్న విషజ్వరాలు..!

- మద్దూరుపేట, శంఖరపేటల్లో ఒక్కో ఇంట్లో ఇద్దరేసి, ముగ్గురేసి రోగులు
- పేరుకుపోయిన అపారిశుధ్యంతో తలెత్తిన ఇబ్బందులు
- చర్యలు తీసుకోవాలని కోరుతున్న గ్రామస్తులు



సంతకవిటి: జ్వరంతో మంచంపట్టిన ఓ చిన్నారి



సంతకవిటి: శంఖరపేటలో జ్వర పీడితులు

సంతకవిటి: మండలంలోని గోళ్లవలస గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న మద్దూరుపేట, శంఖరపేట గ్రామాలను విషజ్వరాలు వణికిస్తున్నాయి. ప్రతి ఇంట్లో ఇద్దరు, ముగ్గురేసి జ్వరాల బారినపడి ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని ఇళ్లల్లో అయితే ఏకంగా కుటుంబ సభ్యులంతా రోగాలతో సతమతమవుతుండడం గ్రామస్తులను ఆందోళన కలిగిస్తోంది. ఈ విషయం తెలుసుకున్న సంతకవిటి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు యు.నాగేంద్ర ప్రసాద్ సిబ్బందితో కలిసి ఆయా ప్రాంతాల్లో శుక్రవారం పర్యటించి, ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి, జ్వర నిర్ధారణ పరీక్షలు చేశారు. ఎక్కువ మంది టైఫాయిడ్, వైరల్ జ్వరాలతో అవస్థలు పడుతున్నట్లు తేలింది. ఈ సందర్భంగా సదరు వైద్యుడు గ్రామస్తులకు ఆరోగ్య సూచనలు చేశారు. వర్షాకాలం నేపథ్యంలో మలేరియా, డెంగీ, టైఫాయిడ్, డయేరియా వంటి సీజనల్ వ్యాధులు ప్రబలుతాయని, ప్రతిఒక్కరూ ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. ప్రతిరోజూ మనం తినే ఆహారంలో పౌష్టికాహారం ఉండేలా చూసుకోవాలని, కొంచెం వేడివేడిగా ఉన్నప్పుడే ఆహార పదార్థాలు తీసుకోవాలన్నారు. కాచివడపోసిన నీటినే తాగాలన్నారు. అలాగే వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత కూడా పాటించాలన్నారు. ఇదిలా ఉంటే గ్రామాల్లోని అపారిశుధ్యం కారణంగా వ్యాధులు తలెత్తుతున్నాయని, అధికారులు స్పందించి పారిశుధ్య చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.



సంతకవిటి: ఒకే ఇంట్లో జ్వరంతో బాధపడుతున్న తండ్రీకొడుకులు

సుప్రీంకోర్టు తీర్పుపై హర్షం



రాజాం: అంబేడ్కర్ విగ్రహం వద్ద సంబరాలు చేసుకుంటున్న మాదిగ దండోరా కమిటీ కార్యకర్తలు

రాజాం: ఎస్సీ వర్గీకరణకు సంబంధించి, సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై నియోజకవర్గానికి చెందిన మాదిగ దండోరా కమిటీ కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా స్థానిక పట్టణంలోని అంబేడ్కర్ జంక్షన్ వద్ద డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి, ఆనందం వ్యక్తం చేశారు. సామాజిక న్యాయం కోసం గత 30 ఏళ్లుగా ఎస్సీలను ఏబీసీడీ వర్గాలుగా విభజించాలనే చేసిన ఉద్యమానికి భారత అత్యున్నత న్యాయస్థానం సంచలన తీర్పు ఇవ్వడం సంతోషంగా ఉందని వారు అన్నారు. దళితులంతా ఐక్యంగా ఉండి రాజ్యాధికారం వైపు అడుగులు వేయాలని పిలుపునిచ్చారు. అనంతరం మందకృష్ణ మాదిగ కృషిని ప్రశంసిస్తూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో మాదిగ రిజర్వేషన్ దండోరా కార్యకర్తలు ఎస్.జగదీష్, చినబాబు, పి.బాబ్జీ, ఎంఈఎఫ్ అధ్యక్షులు ఎ.ఆనందరావు, బి.జయకుమార్, రాష్ట్ర నాయకులు వై.నారాయణరావు, టి.బుజ్జి, రవికుమార్ పాల్, ఏసురత్నం, బాలరాజు, బీజేపీ రాష్ట్ర నాయకులు నారాయణరావు, నాగరాజు, రంజిత్‌కుమార్, అప్పారావు, బాబ్జి, సునీల్ తదితరులు పాల్గొన్నారు.



బొబ్బిలి: అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి, జేజేలు పలుకుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

బొబ్బిలి: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై ఎమ్మార్పీఎస్ నాయకులు గర్భాపు రమేష్, కృష్ణదాస్ హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు మండలంలోని అలజంగి గ్రామంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి, ఆనందం వ్యక్తం చేశారు. వర్గీకరణ కోసం ఇన్నాళ్లుగా చేసిన పోరాటం ఇప్పటికి ఫలించిందన్నారు.

కొనసాగిన పింఛన్ల పంపిణీ

బొబ్బిలి రూరల్: మండలంలోని పలు గ్రామాల్లో రెండో రోజు అయిన శుక్రవారమూ పింఛన్ల పంపిణీ కొనసాగింది. ప్రతినెలా ఒకటో తేదీనే సచివాలయ సిబ్బంది లబ్ధిదారులకు పింఛన్ల నగదు అందజేయాల్సి ఉండగా, మండలంలోని పక్కి, పిరిడి, అలజంగి గ్రామాలకు చెందిన పలువురు లబ్ధిదారులు వివిధ కారణాలతో విశాఖపట్నం తదితర పట్టణాల్లో ఉండడంతో సిబ్బంది వారి వద్దకు వెళ్లి, పింఛన్ అందజేశారని ఎంపీడీవో రవికుమార్ తెలిపారు.

చురుగ్గా శ్మశానవాటిక నిర్మాణం



శ్మశానవాటికను బాగుచేస్తున్న దృశ్యం

రేగిడి: మండలంలోని అప్పాపురం గ్రామ శ్మశానవాటిక నిర్మాణ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. ముళ్లపొదలు, కలుపుమొక్కలతో నిండిపోయిన శ్మశానవాటిక ప్రాంతాన్ని చదును చేశారు. గ్రావెల్ కూడా వేసి రోడ్డు వేస్తున్నారు. పంచాయతీ నిధులతో ఈ పనులు నిర్వహిస్తున్నామని సర్పంచ్ కరణం నిర్మలాశ్రీనివాస్ తెలిపారు.

తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరం

- తల్లిపాల వారోత్సవాల్లో ఐసీడీఎస్ అధికారులు



రాజాం సిటీ: మల్లికార్జునకాలనీలో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది



రాజాం: అవగాహన ర్యాలీలో రాజాం ఐసీడీఎస్ అధికారులు, సిబ్బంది

రాజాం: తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరమని రాజాం ఐసీడీఎస్ పీవో టి.కనకదుర్గ అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం దగ్గర నుంచి అవగాహన ర్యాలీ శుక్రవారం నిర్వహించారు. తల్లిపాలు బిడ్డకు అమృతం వంటిదని, ఆరు నెలల వయసు వచ్చే వరకు శిశువుకు తల్లిపాలే ఇవ్వాలని ఆమె అవగాహన కల్పించారు. ప్రతీ అంగన్‌వాడీ కేంద్రం పరిధిలో తల్లిపాల ఆవశ్యకతను తెలియజేస్తూ అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

రాజాం సిటీ: తల్లిపాల వారోత్సవాలు పురస్కరించుకుని, స్థానిక పట్టణ పరిధిలోని మల్లికార్జున కాలనీలో గర్భిణులు, బాలింతలకు తల్లిపాల ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. పుట్టినబిడ్డకు ఆరు నెలల పాటు తల్లిపాలే ఇవ్వాలని, అదే శిశువుకు సంపూర్ణ ఆరోగ్యాన్నిస్తుందని ఐసీడీఎస్ రాజాం సెక్టార్ సూపర్‌వైజర్ సీహెచ్ సన్యాసమ్మ తెలిపారు. తల్లిపాలే బిడ్డకు సంపూర్ణ పౌష్టికాహారమని, అదే న్యూమోనియా, అతిసారం వంటి ప్రమాదకరమైన వ్యాధుల నుంచి రక్షిస్తుందన్నారు. అలాగే తల్లీబిడ్డల బంధాన్ని పెంచుతుందన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు ఎం.శ్రీదేవి, విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

రామభద్రపురం: తల్లిపాలు బిడ్డకు అమృతంతో సమానమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సూర్యకుమారి, రత్నకుమారి తెలిపారు. మండలంలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రం-1లో గర్భిణులు, బాలింతలతో వారు సమావేశమై, తల్లిపాల వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త చింతల నాగమణి, తదితరులు పాల్గొన్నారు.

తెర్లాం: తల్లిపాలే పుట్టినబిడ్డకు ఆరోగ్యమని ఐసీడీఎస్ బాడంగి ప్రాజెక్ట్ పరిధిలోని తెర్లాం సెక్టార్ సూపర్‌వైజర్ ఉషారాణి అన్నారు. స్థానిక అంగన్‌వాడీ కేంద్రం-4లో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శిశువు పుట్టిన వెంటనే తల్లిపాలు తప్పనిసరిగా ఇవ్వాలన్నారు. ఇలా కనీసం ఆరు నెలల పాటు తల్లిపాలే బిడ్డకు పెట్టాలని సూచించారు. తల్లిపాలలో రోగ నిరోధక శక్తి అధికంగా ఉంటుందని, పుట్టిన వెంటనే బిడ్డకు తల్లిపాలు ఇస్తే ఎటువంటి అనారోగ్య పరిస్థితులు రావన్నారు. స్థానిక ఐదో అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు టేక్ హోమ్ రేషన్ కింద పాలు, గుడ్లు, బియ్యం, ఇతర నిత్యవసర సరుకులు శుక్రవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎస్‌ఐ ఆర్.రమేష్ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పంపిణీ చేస్తున్న పౌష్టికాహారంతోనే గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని, లబ్ధిదారులు ప్రభుత్వం అందజేస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త వై.శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి రూరల్: మండలంలోని పక్కి, పిరిడి, దిబ్బగుడ్డివలస, చింతాడ గ్రామాల్లో తల్లిపాల వారోత్సవాలు శుక్రవారం నిర్వహించారు. తల్లిపాలు సంపూర్ణ పౌష్టికాహారమని, పుట్టిన ప్రతీ బిడ్డకు తల్లిపాలే ఇవ్వాలని అంగన్‌వాడీ సిబ్బంది అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పక్కి సెక్టార్ సూపర్‌వైజర్ వై.రాజు పాల్గొన్నారు.



రామభద్రపురం: తల్లిపాల ప్రయోజనాలు వివరిస్తున్న అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సూర్యకుమారి



తెర్లాం అంగన్‌వాడీ కేంద్రం-4లో తల్లిపాలు ఉపయోగాలు తెలియజేస్తున్న అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఉషారాణి



బొబ్బిలి రూరల్: తల్లిపాల విశిష్టతను వివరిస్తున్న అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రాజు

ఆదర్శప్రాయుడు పింగళి వెంకయ్య



రాజాం సిటీ: పింగళి వెంకయ్య చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పిస్తున్న దృశ్యం



మాజీ సైనికోద్యోగుల సంఘం అధ్యక్షుడిని సత్కరిస్తున్న దృశ్యం

రాజాం సిటీ: జాతీయ పతాక రూపశిల్పి పింగళి వెంకయ్య ఆదర్శప్రాయుడని తహసీల్దార్ ఎస్‌కే రాజు అన్నారు. స్థానిక రెడ్‌క్రాస్ కార్యాలయంలో పింగళి 148వ జయంతి శుక్రవారం నిర్వహించి, ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యానికి చివరి క్షణం వరకు పాటుపడిన మహనీయుడు అని కొనియాడారు. కార్యక్రమంలో రాజాం రెడ్‌క్రాస్ చైర్మన్ కొత్తా సాయిప్రశాంత్‌కుమార్, పెంకి చైతన్యకుమార్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.స్వప్నహైందవి, మానవతా సంస్థ సభ్యులు మక్క అప్పలనాయుడు, గట్టి పాపారావు, బూరాడ శివకృష్ణ, పిడుగు సూర్యారావు, ఉల్లాకుల నీలకంఠేశ్వరయాదవ్, బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు ఆర్‌ఈసీహెచ్ జయదేవ్ పాల్గొన్నారు.

బొబ్బిలి: స్థానిక సత్యసాయి జూనియర్ కళాశాలలో జాతీయ పతాకం రూపశిల్పి పింగళి వెంకయ్య జయంతి శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీ విద్యార్థి జేఏసీ నాయకులు, కళాశాల సిబ్బంది, మాజీ సైనికులంతా కలిసి వెంకయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం ఆయన సేవలను గుర్తుచేసుకున్నారు. బహుభాషావేత్తగా, వ్యవసాయ శాస్త్రవేత్తగా, జియాలజిస్ట్‌గా, స్వాతంత్ర్య సమరయోధుడిగా వెంకయ్య సేవలు వెలకట్టలేనివన్నారు. ఆయన జీవితం అందరికీ ఆదర్శమని, యువత గొప్పవారి బాటను ఎంచుకుని, ఉన్నతంగా జీవించేందుకు ప్రయత్నించాలని కోరారు. అనంతరం మాజీ సైనికోద్యోగుల సంఘం అధ్యక్షుడు రేవళ్ల కిరణ్‌కుమార్‌ను సన్మానించారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ చింత అప్పారావు, ప్రిన్సిపాల్ వంశీ చినబాబు, ఎస్.చంద్రశేఖర్, వెంకటరమణ పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

బోధనలో నూతన పద్ధతులు అవలంబించాలి



రాజాం: రుచి చూసి, మధ్యాహ్న భోజనం పరిశీలిస్తున్న ఎంఈవో దుర్గారావు



రేగిడి: విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు పరిశీలిస్తున్న ఎంఈవో ప్రసాదరావు

రాజాం: బోధనలో నూతన పద్ధతులు అవలంభిస్తూ విద్యార్థులకు అర్థమయ్యేలా పాఠ్యాంశాలు బోధించాలని ఎంఈవో-2 యాగాటి దుర్గారావు సూచించారు. స్థానిక పట్టణంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ఆయన శుక్రవారం సందర్శించారు. అక్కడి పాఠశాల రికార్డులు, విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు, మధ్యాహ్న భోజన పథకం అమలు, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను ఆయన పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యనందివ్వడంతో పాటు రుచి, శుచి కలిగిన ఆహారాన్ని ఇవ్వాలని సిబ్బందికి తెలిపారు. చదువులో వెనకబడిన విద్యార్థుల విద్యాప్రగతిపై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు.

బొబ్బిలి రూరల్: మండలంలోని పిరిడి గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను ఎంఈవో చల్లా లక్ష్మణరావు శుక్రవారం సందర్శించి, అక్కడి విద్యార్థుల కోసం సిద్ధం చేసిన మధ్యాహ్న భోజన పథకం వంటకాలను పరిశీలించారు. కొంచెం వేడివేడిగా ఉన్నప్పుడే విద్యార్థులకు ఆహారం వడ్డించాలని, వంటకాలపై మూతలు పెట్టాలని, వంటగది శుభ్రంగా ఉండేలా చూసుకోవాలని నిర్వాహకులకు సూచించారు. విద్యార్థుల చదువు, ఆరోగ్యంపై దృష్టిసారించాలని ఉపాధ్యాయులకు తెలిపారు.

రేగిడి: మండలంలోని రెడ్డిపేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ఎంఈవో ఎం.వి.ప్రసాదరావు శుక్రవారం సందర్శించి, వివిధ ప్రశ్నల ద్వారా అక్కడి విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను అంచనా వేశారు. అనంతరం ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. విద్యార్థులకు మెరుగైన విద్యనందించాలని, రుచికరమైన మధ్యాహ్న భోజనం అందించాలని తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు తారకేశ్వరరావు, ఉపాధ్యాయులు మల్లీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ముళ్లపొదల తొలగింపు

రాజాం: మున్సిపాలిటీ పరిధిలోని పొనుగుటివలస వద్ద విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ పెరిగిన ముళ్లపొదలు, పిచ్చిమొక్కలను అధికారులు తొలగించారు. ఈ నెల 1వ తేదీన ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ అనే శీర్షికతో సాక్షి దినపత్రికలో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. శుక్రవారం రాజాం ఎలక్ట్రికల్ ఏడీఈ ఫణీంద్రకుమార్‌తో పాటు సంతకవిటి ఇన్‌చార్జ్ ఏఈ సాహెబ్‌లు ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు చేరుకుని, చుట్టూ ప్రమాదకరంగా ఉన్న జంగిల్స్‌ను తొలగించారు. త్వరలో రక్షణ కంచె కూడా ఏర్పాటు చేస్తామని ఏడీఈ తెలిపారు.



గతంలో పిచ్చిమొక్కలతో ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్



పిచ్చిమొక్కలు తొలగించిన తర్వాత ట్రాన్స్‌ఫార్మర్ ఇలా..

గుర్తింపుకార్డులు తీసుకోండి



సమావేశంలో మాట్లాడుతున్న వ్యవసాయ శాఖ ఏడీ శ్యామసుందర్

బొబ్బిలి రూరల్: కౌలురైతులంతా ఈ నెల 10వ తేదీలోగా గుర్తింపుకార్డులు తీసుకోవాలని వ్యవసాయ శాఖ ఏడీ ఎం.శ్యామసుందర్ సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ఎం.శ్రీనుతో కలిసి వ్యవసాయ, రెవెన్యూ సిబ్బందితో సమీక్ష సమావేశం శుక్రవారం నిర్వహించారు. మండలంలో 1520 మంది కౌలురైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వడాన్ని లక్ష్యంగా పెట్టుకున్నామని, ఇప్పటివరకు 963 మందికి ఇవ్వడం జరిగిందన్నారు. రానున్న వారం రోజుల్లో మిగతా కౌలురైతులను కూడా గుర్తించి, గుర్తింపుకార్డులు అందజేయాలన్నారు. అర్హులైన వారు కూడా కౌలురైతు గుర్తింపు కార్డు కోసం దరఖాస్తు చేసుకుని, పొందాలన్నారు.

వినతిపత్రం అందజేత



ఎమ్మెల్యే బేబినాయనకు వినతిపత్రం అందజేస్తున్న బాధితులు

బొబ్బిలి: సహారా ఇండియా(ఫైనాన్స్ సంస్థ) బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని సహారా ఇండియా బొబ్బిలి ప్రాంత బాధితుల సంఘం నాయకుడు పాట్నూరు శంకరరావు విజ్ఞప్తి చేశారు. ఇదే విషయమై బాధితులతో కలిసి ఆయన ఎమ్మెల్యే బేబి నాయనను స్థానిక కోటలోని ఆయన నివాసంలో శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఒక్క బొబ్బిలి ప్రాంతంలోనే 20 వేల మందికి పైగా బాధితులు ఉన్నారని, వారి నుంచి రూ.400 కోట్ల డిపాజిట్ల సేకరణ జరిగిందని తెలిపారు. ఆ తర్వాత ఆ కంపెనీ ముఖం చాటేసిందన్నారు. ఈ విషయమై సుప్రీంకోర్టులో కేసు కూడా నడుస్తోందన్నారు. త్వరితగతిన ఆ కేసు పూర్తయ్యేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకువచ్చి, బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు. దీనిపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించినట్లు సమాచారం. ఆయన వెంట వై.అప్పలనాయుడు, కె.మంగమ్మ, కె.అరుణ తదితరులు పాల్గొన్నారు.